క్లుప్తంగా

చందనం సమర్పణకు విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న దాత రఘురామరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం రూ.50 వేల విరాళాన్ని నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎ.రఘురామరాజు బుధవారం అందించారు. ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు విరాళాన్ని చెక్ రూపంలో ఇచ్చారు. కార్యక్రమంలో హవల్దార్ సాతులూరి రవి, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

విశేషంగా శ్రవణ నక్షత్ర హోమం



హోమం చేస్తున్న అర్చకులు

సింహాచలం: వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై చక్రపెరుమాళ్లని వేంజేపచేశారు. హోమగుండం ఏర్పాటు చేసిన విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి జరిపారు. భక్తులకు యజ్ఞ ప్రసాదం అందించారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నరసింహం తదితరులు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు, గ్రామస్తులు అశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సింధూర పూజలు, తమలపాకుల పూజలు నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, టీడీపీ జిల్లా కార్యదర్శి లండ శ్రీనివాస్, వార్డు కార్యదర్శి దాసరి పైడిరాజు, మజ్జి కోటి, తోట మధు, బంధం సూరిబాబు, విజినిగిరి గోపి, పాలూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.

అప్పన్న సన్నిధిలో ఐటీ ప్రిన్సిపల్ కమిషనర్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్(విశాఖ) బి.శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, శేష వస్త్రాలు, ప్రసాదం ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.





హరహరక్షేత్రంలో పూజలందుకున్న శివుడు



శ్రమశక్తినగర్‌లో పూజలందుకుంటున్న రామలింగేశ్వరస్వామి



పినగాడి చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



సింహపురి కాలనీ ఉమారామలింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

జగమంతా.. జంగమయ్య పండగ

ఊరూవాడా మహా శివరాత్రి శోభ

పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు

ఘనంగా లింగోద్భవ పూజలు

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

శివుడంటే లయం.. తనలో ఐక్యం చేసుకుంటాడు. శివుడంటే అభయం.. ఆశ్రయిస్తే మృత్యువునే తరిమికొడతాడు. శిరసుపై నిత్యం గంగమ్మ కొలువుదీరినా.. చెంబుడు నీళ్లతో సంతృప్తి చెందుతాడు. అందుకే ఆ భోళా శంకరుడికి అత్యంత ప్రీతికరమైన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో ఊరూవాడా శివనామ స్మరణతో మార్మోగింది. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు శైవ క్షేత్రాల వద్ద బారులు తీరారు. అభిషేక ప్రియుడైన స్వామివారికి ప్రత్యేక పూజలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలతో అర్చించారు. రోజంతా ఉపవాసం, జాగరణలతో తమ భక్తిని చాటుకున్నారు.



కాశీవిశ్వేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



చినముషిడివాడలో పూజల్లో పాల్గొన్న అశేష భక్తజనం

పెందుర్తి: సర్వం శివమయం.. అంతటా హర నామస్మరణే.. అన్ని దారులూ శంకరుని పవిత్ర సన్నిధికే.. ఆ భోళాశంకరుడిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తజనం పోటీ పడ్డారు. శక్తి కొలదీ పూజలు చేశారు. మనసారా మహాదేవుడ్ని కొలిచారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు రోజంతా భక్తులతో కిటకిటలాడాయి.

- పెందుర్తిలోని పురాతన సాధూమఠం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము నుంచి భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. రుద్రాభిషేకం, కుంకుమ పూజలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. శివుని దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.
- కృష్ణరాయపురం శివాలయంలో ప్రత్యేక హోమాలు చేశారు. రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారు జాము 5 గంటల నుంచే మహాశివునికి పూజలు జరిగాయి.
- శ్రమశక్తినగర్ రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, విశేష పూజలు జరిపారు. వేలాదిమంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.
- చింతలగ్రహారం శివాలయంలో శంకరుడికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.



సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

- గణేష్‌నగర్, సుజాతనగర్, సరిపల్లి, ప్రశాంతినగర్, సుజాతనగర్ హరహర క్షేత్రాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం మజ్జిగ, ప్రసాద వితరణ చేపట్టారు. ప్రజలు ఉపవాసాలు, జాగరణలు చేశారు. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

శారదాపీఠంలో ఘనంగా మహాశివరాత్రి

చినముషిడివాడలోని శారదాపీఠంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేధా దక్షిణామూర్తికి పలు రకాల ద్రవ్యాలతో అభిషేకం, రుద్రాభిషేకం జరిపారు. చంద్రమౌళీశ్వర స్వామికి భక్తులు స్వహస్తాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం జరిగిన సంగీత విభావరిలో కళాకారులు భక్తిగీతాలతో ఆకట్టుకున్నారు. కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



సింహగిరికాలనీ ఉమారామలింగేశ్వరస్వామి అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

సింహాచలం: మహాశివరాత్రిని పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఓం నమఃశివాయ, హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణలో మునిగితేలారు. పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో ఉన్న నాగేంద్రుడు, రావి, మర్రిచెట్ల వద్ద పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. రాత్రి 10.30 నుంచి మహా రుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజలు పెద్ద ఎత్తున జరిపారు. అర్చకులు వెలమలపల్లి రమణమూర్తి, మంథా కాశ్యప్ శర్మ, సరిపల్లి కిరణ్ శర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

- సింహపురికాలనీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి ఏకవారాభిషేకాలు, 10.30 నుంచి మహన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకం, రాత్రి లింగోద్భవ పూజలు వైభవంగా నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.
- విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, ప్రియాగార్డెన్స్‌లోని వాయులింగేశ్వరస్వామి ఆలయం, పాత అడవివరం, కాపుదిబ్బ ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు, ప్రహ్లాదపురం ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సబ్బవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, వంగలిలోని సోమలింగేశ్వరస్వామి, దేవీపురంలోని పంచభూత లింగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు బారులుతీరారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అసకపల్లిలో ప్రారంభోత్సవం చేసిన అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, శిరీష దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కొటాన రాము, బోకం రామునాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, దేవీ సాంబ, గొర్లి రాజేష్, మామిడి కొండాజీ, కాపుశెట్టి నీలవేణి తదితరులు ఉన్నారు. లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దర్శించుకునిని ప్రత్యేక పూజలు జరిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 10 గంటల నుంచి శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదికపై కొలువుంచారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేపచేసి బేడా సేవ జరిపారు. భక్తులకు కల్యాణ అక్షింతలు, ప్రసాదాన్ని ఆలయ కమిటీ పంపిణీ చేసింది.



శివపార్వతుల ఉత్సవమూర్తులు



దక్షిణామూర్తికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు



దేవీపురంలో పంచభూతలింగేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న చిన్నారులు



దేవీపురంలోని శ్రీచక్ర ఆలయం వద్ద కోలాటం పోటీలు



అసకపల్లి అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



లింగాలతిరుగుడులో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- నియోజకవర్గంలో 1,153 మంది ఉపాధ్యాయ ఓటర్లు

పెందుర్తి/పరవాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సమయం ఆసన్నమైంది. బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. పెందుర్తి నియోజకవర్గంలో మూడు కేంద్రాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు ముగుస్తుంది. నియోజకవర్గం పరిధిలో మొత్తం 1153 ఓట్లు ఉండగా, అత్యధికంగా పెందుర్తిలో 954 మంది ఉన్నారు. సబ్బవరంలో 94, పరవాడలో 84, పెదగంట్యాడలో 21 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళా ఓటర్లదే పైచేయి. పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో నెంబర్ గది, సబ్బవరం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పరవాడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉంది.

కూటమి కుయుక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం అధికార కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. తాయిళాలు ప్రకటించి ఉపాధ్యాయ ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో ఓటుకు రూ.10–15 వేలు పంచుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాంతోపాటు ఇతర తాయిళాలు కూడా అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కూటమి నాయకుల మాట వినని వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. రానున్న ఉపాధ్యాయ బదిలీలు, ఇతర విధుల్లో సమస్యలు సృష్టిస్తామని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.



పోలింగ్ కేంద్రం వద్ద సీఐ, తహసీల్దార్

నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
పెందుర్తి	453	501	954
సబ్బవరం	50	44	94
పరవాడ	32	52	84
పెదగంట్యాడ	12	09	21

పోలింగ్‌కు అంతా సిద్ధం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు మండల పరిధిలో అంతా సిద్ధంగా ఉంది. పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఓటర్ల స్లిప్‌లు కూడా అందరికీ పంపిణీ చేశాం. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాం. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాం.

– ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

పటిష్ట బందోబస్తు

పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలింగ్ పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. పోలింగ్ కేంద్రం సమీపంలో జెరాక్స్ సెంటర్లను మూసేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. అనుమానిత వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టాం.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?



గుంతలమయంగా పెదముషిడివాడ-సబ్బవరం రోడ్డు



అధ్వానంగా మారిన ఎన్టీపీసీ-వెన్నలపాలెం రోడ్డు

పరవాడ: అధికారంలోకి వస్తే అధ్వాన రోడ్లను అద్దంలా తయారు చేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు కావస్తున్నా రోడ్ల దుస్థితిని మార్చడంలో కనీస చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. పరవాడ మండలంలో అనేక గ్రామాల రోడ్లు మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. మండల పరిధి పెదముషిడివాడ నుంచి సబ్బవరం వరకు ఏర్పాటు చేసిన రోడ్డు గత ఏడాది భారీ వర్షాలకు ఛిద్రమైంది. ఫలితంగా గ్రామీణ ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మోకాలి లోతు గోతులతో నిండి పోయింది. గోతుల రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు తరచూ రిపేర్లకు వస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గుంతల రోడ్డులో ప్రయాణాలు సాగించాల్సి రావడంతో ఒళ్లు హూనమవుతోందని వాపోతున్నారు. రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని రూ.65 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేగా గెలిచిన నెలలోనే పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇచ్చిన హామీ, నేటి వరకూ కార్యరూపం దాల్చకపోవడాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఎన్టీపీసీ-వెన్నలపాలెం రహదారి కూడా మరమ్మతులకు గురైంది. గోతులతో నిండిపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులు అవస్థలను గుర్తించి రోడ్ల మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

9న కోదండరామస్వామి ఆలయ ప్రారంభోత్సవం



తుది మెరుగుల్లో కోదండరామస్వామి ఆలయం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో పునర్నిర్మించిన లక్ష్మీ గణపతి, కనకమహాలక్ష్మి, నాగబంధ సమేత కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవాన్ని మార్చి 9న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బోకం రామునాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠ మహోత్సవ గోడపత్రికను ఎంపీపీ బోకం సూర్యకుమారి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీర్ణావస్థలో ఆలయాన్ని తొలగించి సుమారు రూ.కోటితో సుందరంగా పునర్నిర్మించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో ఆలయ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారు శ్రీను, ఉప సర్పంచ్ గజ్జి దేముడు, ఆలయ ప్రధాన అర్చకుడు ఆరాధ్యుల సీతారామాంజనేయశాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవం.. వీరాంజనేయస్వామి తీర్థమహోత్సవం



మొగలిపురంలో ఎడ్ల పందాల్లో పరుగులు తీస్తున్న ఎడ్ల బండి



విజేతలకు బహుమతులు అందిస్తున్న గండి రవికుమార్

సబ్బవరం: మండలంలోని మొగలిపురం శివారులో కొలువైన వీరాంజనేయస్వామివారి తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం స్వామి సన్నిధిలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవంలో భాగంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు మండల వాసులతో పాటు, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీలో సోమాలమ్మతల్లి బండి(నక్కపల్లి), 2వ స్థానంలో పరవాడ నాయుడు(అజనగిరి), 3వ స్థానంలో ముమ్మన కనకరాజు (నరసయ్యపేట), 4వ స్థానంలో శ్రీపైడితల్లమ్మ బండి(నక్కవానిపాలెం), 5వ స్థానంలో శ్రీఆంజనేయ బండి(కేజేపురం), 6వ స్థానంలో నర్సింగ్ యాదవ్(నరసాపురం) బండి నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మాజీ ఎంపీపీ గండి దేముడు, వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో వరుసగా నగదు బహుమతులు అందించారు. సాయంత్రం స్వామివారి ఆలయం వద్ద నిర్వహించిన డ్యాన్స్ హంగామా ప్రేక్షకులను ఆకట్టుకుంది.